ఫ్రమ్ :
రాఘవ,
విశాఖ.

1-3-81,
విశాఖ.

అపురూపమైన మనోజ్ఞ దృశ్యాన్ని గుండెలో నిక్షిప్తం చేసే కొన్ని కవి మాటల్లో—తన భావాన్ని ప్రకటించేయబోయే ముందటి అసందిగ్ధతలా నా గుండె నిండా. నిన్నేమని పిలుస్తూ రాయాలన్నదే-నన్ను పీడిస్తున్న అనుమానం. ఎలాగని సంబోధించాలి. ప్రియమైన నీకు అనా? పాత ప్రేయసికి అనా? చెదలు పట్టిన జ్ఞాపకాలకి అనా? ఏమో?

తెల్లారకట్ట వెలుగుల తోరణాల్లో విరిసిన ఆకాశం— చీకటి రాలిపడ్తూ. రాత్రిసముద్రంలో మునిగిన ఆకాశం రెండూ వేరూనా? ఒకే ఆకాశం రెండు విరుద్ధ స్థితులని. ఒకే దోవలో — ఒకే బండిలో ప్రయాణిస్తున్న మనం రెండు వేరే వేరే తీరాలో ఎలా స్థిరపడ్డామన్నది నీలో మెదిలే ప్రశ్న కావచ్చు.

కొన్ని విషయాల్ని జ్ఞాపకం చేసుకుంటున్నాను మనిద్దరి పరిచయంముఖపరిచయమే. ఎప్పుడూ మాట్లాడుకోలేదు. కేవలం ముఖపరిచయం అనికూడా ఎన్నడూ అనుకోలేదు కూడా. అవును. మన అపరిచిత చిర పరిచయం ఎంత గాఢమైందీ. గూఢమైందీ మనిద్దరికీ తెల్సుకదా! నిన్ను మొట్టమొదటి సారి ఎప్పుడు—? అదే మా ఇంటివేపుగా నువ్వు పుస్తకాలు పట్టుకొని. తలొంచుకొని పోతున్నావు చూడు—అప్పుడు చూశాను. ఆ తర్వాత నీకు తెలిసే వుంటుంది— కొత్తగా ఆ ఇంట్లో మేం చేరేమని. అప్పుడు నేనేమనుకున్నానో తెలుసా? నువ్వు నేనారోజు చేరబోయే కాలేజీ అయ్యుంటే బావుంటుందని. ఆశ్చర్యం!- మా కాలేజియేకాదు. మా క్లాసులోనే నువ్వు కనిపించావు. నా వేపు మందస్మితమైన ముఖారవిందంతో చూశావ్. అంతేకదూ! ఏమో నేనలా అనుకున్నాను. (కాకపోయినా పర్లేదు. ఆ రోజులు అజ్ఞాన తిమిరాలని నాకు తెల్సు. నువ్వు నా వేపు చూసి ఉండవని నా నమ్మకం. అదంతా నా భ్రమే అయ్యుంటుంది)

అప్పట్లో నా కొద్దే స్నేహితులుండేవారు కాదు. నే నొక్కణ్ణే అందరినుంచీ విడిగా. వడిగా అడుగులేసుకొంటూ వెళ్ళిపోయేవాణ్ని కాలేజి వదలగానే. ఎవ్వర్తోనూ కలవక ఒంటరి పక్షి ఆకాశంలో దిక్కులు వెతుక్కుంటునట్టు తల తిప్పి చూస్తే నువ్వు కన్పించేదానివి — నా ఏకాకితనం ముళ్ళ చెట్టుకి పూచిన గులాబీపువ్వులా. నేను రోడ్డుకి వేపు. నువ్వా వేపు సాగిపోయే వాళ్ళం. ప్రపంచ రథాన్ని మనిద్దరం ముందుకి నడిపిస్తున్నట్టు తోచేది. అప్పుడప్పుడు నిన్ను దొంగతనంగా చూసేవాడ్ని. సరిగ్గా అదే స్థితిలో నువ్వు పట్టుబడిపోయేదానివి. (అప్పటికింకా నువ్వు నన్ను ప్రేమించి వుండకపోవచ్చు. కాని ఆ తర్వాత నాతో మాట్లాడ్డానికి నువ్వు చేసిన ప్రయత్నం- నేనెప్పుడన్నా కన్పించకపోతే. నీ కళ్ళు నాకోసం అన్నివేపులకి వెతకటం- కనీకన్పించగానే హఠాత్తుగా పొంగిపోవటం నాకు తెల్సు.)


జీవిత గడియారం ముని వాకిట నించొన్న నేను గడుస్తోన్న కాలాన్ని. పేరుకుపోతున్న గతాన్ని గుర్తించలేదు. ఔను. గతం ఎంత గొప్పది?— అజ్ఞాన రూపమనే కాని ఔన్నత్యానికి దారితీసే. జీవనోత్తుంగ కెరటం తను.

మీ ఇంటికీ మా యింటికీ ఎంత యెడం? చాలా దగ్గిర. నువ్వు కన్పించకపోతే. పిచ్చిగా చూసేవాణ్ణి. జామచెట్టు-ఆ పక్కనే కిటికీ. కిటికీలో నువ్వు నవ్వుతూ కనిపించేదానివి. రాత్రిళ్ళు చదువుకొని వరండాలో పచార్లు చేస్తున్నపుడు. లైటార్పేసి దాబా పిట్టగోడమీద కూచొని చీకట్లో కనీ కనిపించని మసక వెల్తుర్లో నక్షత్రాల్ని లెక్కేసుకొంటూ. మునుల్లా భయంకర నిశ్శబ్దంలో ఏకాగ్రంగా నిమగ్నమైన చెట్లని చూస్తూ అలానే ఉండిపోయేవాణ్ణి ఒక్కసారి లైట్లన్నీ వేసి- మెరిసిపోయేదానివి. తళుక్కుమని తెగి. ఆకాశంలో లీనమైన మెరుపులా మటుమాయమయ్యే దానివి-మళ్ళీ.

తెరిచిన మహా గ్రంథంలా అప్పటికి అర్థమై. అర్థం కాని నువ్వు కళ్ళప్పగించి క్లాసులో నా వేపు చూస్తుండిపోయేదానివి. నీ వేపు బెరుకుగా (బహుశా పిరికితనం కావచ్చు.) చూసి-తలొంచుకొని ఆలోచనల్లో నిమగ్నమయ్యేవాణ్ణి.


మహాప్రేమికులైనా సరే! వాళ్ళ తొలి పలకరింపులు బలే గమ్మత్తుగా ఉంటాయి. ఇప్పుడైతే అలాంటివి విన్నప్పుడు చిన్న స్మైయిల్ మొహమ్మీద విరుస్తుంటుంది. నాకు బాగా గుర్తు. ఆ రోజు హాల్ టికెట్ తీసుకొని కాలేజీ నించి వస్తుంటే నా నెంబరేమిటని అడగబోయావు. కాని నా ఆత్రుతలో (విన్నప్పుడు చూళ్ళేదు) చాలా దూరంవెళ్ళిపోయానప్పటికే! ఈ విషయం నీ స్నేహితురాలితో చెప్తుంటే విన్నాను. మన పలకరింత ఊహ పులకరింతగానే ఉండిపోయింది కదూ.

అప్పుడు మనమెప్పుడూ ఆలోచించలేదు— కులాల్ని. మతాల్ని నిజమే మన ఇద్దరి కులాలు ఒకటి కావు. (ప్రేమలో వున్న గొప్పతనం ఇదే నిజంగా!) నా ఫ్రెండొకతనుండేవాడు— నీకు చాలా దగ్గిర బంధువు. నిన్ను అంతర్లీనంగా ప్రేమించేవాడు. తన ప్రేమని నా దగ్గిర



# ప్రేమలేఖ

ఎస్. ఎ. రవూఫ్



చాలాసార్లు వెళ్ళబోసుకున్నాడు. (ఆయనే కదా మీ శ్రీవారు.) నీకెంతమంది ఆరాధకు లున్నారో నాకు తెల్సు. నీకూ తెల్సు. ప్రేమా, పైత్యం అంటూ నా వెంట ఒక అమ్మాయి పడితే, నాక్కనిపించకుండా వారం రోజులపాటు నామీద కసి తీర్చు కున్నావ్— నీకు జ్ఞాపకమేనా? ఇది నాకె ప్పుడూ నవ్వు తెప్పించే విషయం.

నాకు ఎంతో మంది ఫ్రెండ్స్ ఉండే వాళ్ళు; అవును అప్పటికి కాలేజీ జీవితం ఏణ్ణర్థం గడిచిపోయింది మరి. నెమ్మదిగా చాలామందే పరిచయమయారు. మా వీధి చివర నించొని మేమంతా కబుర్లాడు కొంటున్నాం. అయినా నువ్వు జంకకుండా నా చుట్టూ చాలాసార్లు ప్రదక్షిణం చేశావ్. ఆ కొసని నించొని కళ్ళతో చాలా మాట్లా డావ్—అవును. ప్రేమకి కళ్ళే కదా వకళ్ళు.

అప్పుడే రూఢిచేసుకొన్నాం—పరస్పరం ప్రేమించుకొన్నామని. మన గురించి ఎన్ని కథలు ప్రచారంలో ఉండేవి అప్పట్లో.

అప్పుడే కదా మనం విడిపోయింది కూడా. టెక్నికల్ కోర్సెస్ చదువుదామని ఇటొచ్చేశాను. అప్పటికి నువ్వూ, మూర్తీ అదే కాలేజీలో చదువుతుండేవాళ్ళు కదా!

మీ ఊళ్ళో నాకున్న మొదటి ఫ్రెండ్, బెస్ట్‌ఫ్రెండ్ అయిన మూర్తి- (అదే మీ ఆయన)తో నా గురించి అడగటానికి ప్రయత్నించావ్. కాని అడగలేదు. "మీరు పరీక్షలెలా రాశారు; మార్క్సు ఎలా వస్తా యనుకొంటున్నారు." అని ప్రశ్నించావ్ అతన్ని (నాకు మేధ- ఆమే- నీ ఫ్రెండ్ నవ్వుతూ ఈ విషయం చెప్పింది- ఆమధ్య మీ కాలేజీకి వచ్చినప్పుడు; అన్నట్టు నే నెలాంటి బెరుకూ లేకుండా అమ్మాయిల్తో మాట్లాడగలుగుతున్నా తెల్సా?) అలా మీ పరిచయం వృద్ధి అయ్యింది. పెద్దవాళ్ళ ఆమోదం దొరికి మీ పెళ్ళి బ్రహ్మాండంగా, అతి వైభవంగా జరిగింది. అవునూ నీ పెళ్ళి కొచ్చినపుడు నువ్వు నన్ను అడిగావు. 'నన్ను అసహ్యించుకొంటున్నారా?' అని. (ఆ ప్రశ్నకి సమాధానంగానే ఈ ఉత్తరం రాయాల్సొచ్చింది.) కాని నీమీద నాకెలాంటి భావమూ లేదు. నిజానికి నేనే అమ్మాయిని ప్రేమించలేను. (ప్రేమకర్థం ఇప్పుడు నాకు కలలో వున్నది కాదు.) చివరికి నిన్ను కూడా. యౌవనపు తొలిరోజుల్లో యువతీ యువకుల మధ్య ఏర్పడే ఆకర్షణే మనిద్దరి సాన్నిహిత్యం. అంతకు మించి మరేమీ కాదు. నిన్ను నేనాకర్షించాను (నా మనసు మరెవరున్నా అలానే ఆకర్షింపబడేదానివి. నేను కూడాను). అంతెందుకు నా స్నేహితుడిగా నీకు తెలిసిన మూర్తిలో "నా మూర్తిని" చూసుకొన్నావ్- ఇది మటుకు ఆకర్షణ కాదంటావా?

వింటున్నావా? ఇక్కడ నాకు నలుగురు అమ్మాయిలు తారసపడ్డారు. నీకు తెలుసు కదా- నా టిక్కెట్లు- అందుకని దూరంగా మసలుకొనేవాణ్ని. భారతి అనే అమ్మాయి నీలానే నాకు సన్నిహితంగా వచ్చింది. క్రితం మాసెరి. అంటే, మన 'ప్రేమ'కి ఈ కథ డిటోగా నడిచేదేమో? కాని సరిగ్గా అదే కాలంలో రూప, వైచిత్రి, కుమారి నా జీవన ప్రాంగణంలోకి తొంగి చూశారు.

అప్పటిక్కానీ ప్రేమకీ, ఆకర్షణకీ అర్థం తెలియలేదు. అందుకే అలాగా తేలివచ్చిన వాళ్ళు కాలం మరగలలో వెనక్కి మళ్ళి అలవోకగా వెళ్ళిపోయారు. నువ్వుకూడా నాకు జ్ఞాపకం (అంటే ప్రేయసిగా) లేవంటే నమ్ముతావా? సాటిమనిషి మీద చూపే జాలి, కరుణ, వాత్సల్యం, దయ- ఇవేకదా ప్రేమకి పర్యాయపదాలు. అందుకనే చాలా నిర్మలంగా, ప్రశాంతంగా ఉన్నానిప్పుడు.

నాకు నీమీద కోపం, చిరాకుల్లాంటివేం లేవు.

మూర్తిని అడిగానని చెప్పు.

ఉంటాను.

నీ అందరు నేస్తాల్లాంటి—ఒక

—రాఘవ

1-3-1981

(ఇది ప్రేమని గురించి రాసిన లేఖ కనుక ప్రేమలేఖే మరి. ఉత్తరాల మాదిరి కథ రాయటం కొత్త ప్రక్రియేం కాదు. ఆ దోవలో రాసిన మినీ కథ ఇది. —రచయిత)